

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 276 | పేజీలు : 8 | వెల : రూ.2/- | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

స్పష్టం చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని వెల్లడి



2లో

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

● కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు ● రైతుల ప్రయోజనాలు, పర్యావరణంపై దృష్టి పెట్టాలని సూచన



2లో

ఏపీకి మరో తుఫాన్ ముప్పు!

● నవంబర్ 1, 2 తేదీల్లో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ● అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 29: ఆంధ్రప్రదేశ్‌కు అర్ణబ్ తుఫాన్ ముప్పు నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. దక్షిణ అండమాన్, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారినట్లు వాతావరణ శాఖ మిగతా2లో...

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం!

● నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం.. పునరుద్ధరణ చర్యల్లో వేగం పెంచండి ● ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే ● రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.6,500 కోట్ల నష్టం అంచనా ● విద్యుత్, పంట నష్టాలపై సమీక్ష.. బాధితులకు పరిహారం అందేలా చర్యలు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 29: ఆర్నబ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన ప్రజలు, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, ఉద్యాన తోటలు, విద్యుత్ వ్యవస్థ, ఆక్వా చెరువులను గురువారం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మిగతా2లో...



రిటర్నింగ్ ఆఫీసర్లే చంద్రబాబుకు ఏజెంట్లు!

వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు చించేశారని జగన్ ఆరోపణ

ఎన్నికల అక్రమాలపై ఆధారాలు సేకరించాలని పార్టీ నేతలకు సూచన

అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 29: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏజెంట్లుగా పనిచేస్తున్నారని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను అధికారులే చించేశారని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని వ్యాఖ్యానించారు. మిగతా2లో...

పెట్టుబడులకు భద్రత.. తెలంగాణ అభివృద్ధికి భరోసా!

● పెట్టుబడిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ● 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ లక్ష్యం



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 29: బాధ్యతని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తలకు భద్రత కల్పించి, వారి వ్యాపారాలు అభివృద్ధి చెందేలా చూడటం తన వ్యక్తిగత బాధ్యతని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గురువారం మిగతా2లో...

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

బీజేపీకి కంచుకోటగా భావించే ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ విజయాలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు



2లో

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

● 550 ఎకరాలపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం



హైదరాబాద్:మన జనప్రగతి అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని మియాపూర్ భూములపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో విజయం లభించింది. సుమారు 550 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులు తమవేనంటూ ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న భూ వివాదానికి ముగింపు పలికినట్లయింది.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న భూములపై ఈ వివాదం కొనసాగుతోంది. గతంలో ప్రత్యేక న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వగా, 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మిగతా2లో...

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

- నవంబర్ 26 వరకు క్లెయిములు, అభ్యంతరాలకు అవకాశం
- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల



2లో

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

- నితీన్ నబీన్ ఆధ్వర్యంలో కీలక సమావేశాలు



2లో

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు



2లో

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

30 - 10 - 2026

100 శాతం ఇథనాల్ వాహనాలకు ఇంధనం ఎలా?

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 29:100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి ఇస్తే, వాటికి అవసరమైన ఇంధనాన్ని ఎలా సరఫరా చేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి వాహనాలకు పెద్ద మొత్తంలో ఇథనాల్ అవసరమవుతుందని, అందుకు తగిన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థను ఎలా ఏర్పాటు చేస్తారో వివరించాలని సూచించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం ఇథనాల్ కేటాయింపులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ప్రశ్నలు లేవనెత్తింది. వాహనాలు పూర్తిస్థాయిలో ఇథనాల్‌తో నడిచేందుకు అనుమతించినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ, అవసరమైన ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై స్పష్టత కోరింది. దీనిపై స్పందించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, ఇలాంటి మార్పులకు భారీ స్థాయిలో తయారీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సి ఉంటుందని తెలిపారు.**రైతుల ప్రయోజనాలకూ ప్రాధాన్యం** ఇథనాల్ విధానాన్ని పరిశీలించేటప్పుడు పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య ప్రజలకు ప్రయోజనం కలిగేలా విధానాలు ఉండాలని పేర్కొంది. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే అంశానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. మరోవైపు, కేంద్ర రహదారి రవాణా మంత్రిత్వ శాఖ అక్టోబర్ 26న వాహన నిబంధనల్లో సవరణలు చేసింది. ఈ మార్పులతో అధిక ఇథనాల్ మిశ్రమాలతో పాటు దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్‌తో నడిచే వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ నిబంధనల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే శాతాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే తక్షణ ప్రణాళిక లేదని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి అక్టోబర్ 27న వెల్లడించారు.ఇథనాల్ సరఫరా సంవత్సరం 202526కు సంబంధించి కేటాయింపులపై కొనసాగుతున్న కేసులో సుప్రీంకోర్టు తదుపరి విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది. ఇథనాల్ వినియోగాన్ని ప్రోత్సహించే విధానాల్లో సరఫరా సామర్థ్యం, రైతుల ఆదాయం, పర్యావరణ ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ విచారణ మరోసారి ముందుకు తెచ్చింది.

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం!

(మొదటి పేజీ తరువాయి)

వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టం జరగకుండా చూడటంతో పాటు, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమికంగా సుమారు రూ.6,500 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పంటలు, ఉద్యాన పంటలు, విద్యుత్ వ్యవస్థ, మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టంపై అధికారులు సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బాధితులకు సహాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. తుఫాన్ వంటి ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు సమర్థంగా అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ విధానం రూపొందిస్తామని వెల్లడించారు.**దెబ్బతిన్న పంటలు.. కూలిన విద్యుత్ స్తంభాలు** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి బయలుదేరి కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించారు. నిమ్మకూరు, పామర్రు, బంటుమిల్లి, నరసాపురం, పాలకొల్లు, అమలాపురం, కాట్రేనికోన తదితర ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలు, దెబ్బతిన్న అరటి తోటలు, కూలిన కొబ్బరి చెట్లు, ఆక్వా చెరువులను పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి, ప్రజల జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు అధికారులు వివరించారు.కోనసీమ ప్రాంతంలో సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి విద్యుత్ సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో మారుమూల ప్రాంతాలకు సైతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.**తీర ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ కేబుళ్లు** తీర ప్రాంతాల్లో తుఫాన్ల కారణంగా విద్యుత్ వ్యవస్థ దెబ్బతినకుండా దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రకృతి విపత్తుల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నాణ్యత, వేగం రెండింటికీ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు తాగునీరు, విద్యుత్, ఇతర అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.**రైతులతో ముఖాముఖి.. పంట నష్టంపై ఆరా** వేట్లపాలెంలో తుఫాన్ బాధిత రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా మాట్లాడారు. మరో 15 రోజుల్లో కోతకు సిద్ధమయ్యే వరి పంట తుఫాన్ కారణంగా దెబ్బతిన్నదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పంట నీట మునగడంతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న కొబ్బరి చెట్లను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. పంటల బీమా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పంట నష్టాన్ని అంచనా వేసేటప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని, రైతులకు న్యాయం జరిగేలా నివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పంటలు, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించి అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.**ప్రత్యేక కార్యాచరణ విధానం.. కేంద్ర బృందాల పరిశీలన** ప్రకృతి విపత్తుల సమయంలో నష్టం అంచనా, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు వేగంగా జరిగేలా ప్రత్యేక కార్యాచరణ విధానాన్ని రూపొందించనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

పెట్టుబడులకు భద్రత.. తెలంగాణ అభివృద్ధికి భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో నిర్వహిం చిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. **పెట్టుబడులు రెట్టింపు చేయండి** తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలను కుంటున్నారో ముందుగా నిర్ణయించుకుని, ఆ మొత్తాన్ని రెట్టింపు చేయాలని పారిశ్రామిక వేత్తలకు సీఎం సూచించారు. పెట్టుబడిదారుల ఆశించిన వృద్ధి, లాభాల లక్ష్యాలు కూడా పెంచుకోవాలని కోరారు. పెట్టుబడులకు సంబంధించి విధాన పరమైన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం ఏది అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల అభిప్రాయాలను స్వీకరించి, ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం** 'తెలంగాణ రైజింగ్2047' ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉందని, 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే అందులో తెలంగాణ వాటా పది శాతంగా ఉండాలని ఆకాంక్షించారు.**ప్రపంచ నగరాలతో పోటీ పడాలి**సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిందని సీఎం పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను తయారు చేయడంలో నగరానికి ప్రత్యేకత ఉందన్నారు. హైదరాబాద్ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో మాత్రమే కాకుండా న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలని ఆకాంక్షించారు. **మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం**హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణె మార్గాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటు, వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రస్తావించారు. ప్రాంతీయ రహదారి వలయం, మెట్రో రైలు విస్తరణ తదితర ప్రాజెక్టులతో రాష్ట్రంలో రవాణా, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. పెట్టుబడిదారుల విజయానికి అడ్డంకులు తొలగించి, అనుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు.**తెలంగాణ లక్ష్యానికి కేంద్రం సహకారం: పీయూష్ గోయల్**తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యాన్ని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్వాగతించారు. బలమైన కృషితో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జహీరాబాద్‌లో టెక్స్‌టైల్ పార్క్, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం!

హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 29:బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఎన్ని స్థానాలు గెలిచామన్నది మాత్రమే కాకుండా, ఎక్కడ విజయం సాధించామన్నది కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. బీజేపీకి బలమైన ప్రాంతాలుగా భావించే చోట్ల కూడా ప్రతిపక్ష పార్టీలు విజయాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు.బీజేపీకి కంచుకోటగా భావించే నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించిందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గెలిచారని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రస్తావించారు. ఈ ఫలితాలు ప్రజల రాజకీయ అభిప్రాయాల్లో మార్పును సూచిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలపై బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్యానించారు.**నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ** ఢిల్లీలో నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి నిరసన ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తాయని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు తమ నిరసనను తెలియజేయనున్నాయని పేర్కొన్నారు.ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్లను నిరాకరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల నిరసనను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లి ర్యాలీలో పాల్గొంటారని స్పష్టం చేశారు.బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 29: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును భారత ఎన్నికల సంఘం పొడిగించింది. క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 26 వరకు అవకాశం కల్పించింది. ఈ రెండు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాలను నవంబర్ 30న ప్రచురించనున్నట్లు ప్రకటించింది.ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ప్రజలకు మరింత సమయం ఇవ్వాలన్న అభ్యర్థనల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. గడువు పొడిగించాలంటూ బుధవారం సుప్రీంకోర్టు చేసిన సూచనల తర్వాత రోజే ఈసీ సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదు, వివరాల సవరణ, అభ్యంతరాల పరిష్కారానికి ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. **ఇతర రాష్ట్రాల్లోనూ గడువు పెంపు**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, హరియాణా, నాగాలాండ్, ఢిల్లీలోనూ ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మహారాష్ట్రలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 13 వరకు గడువు ఇచ్చారు. అక్కడ నోటీసులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 25 వరకు కొనసాగుతుంది. తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న విడుదల చేయనున్నారు.ఢిల్లీలో క్లెయిములు, అభ్యంతరాల నమోదుకు నవంబర్ 25 వరకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ డిసెంబర్ 15 వరకు కొనసాగనుండగా, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నారు.ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పుల కోసం నిర్దిష్ట గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అధికారులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న భారీ నిరసన ర్యాలీ

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 29:నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై బాధ్యత వహించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిరసనకు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా ఉన్నాయని ఖర్గే తెలిపారు.ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 1న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ ప్రజలకు పిలుపునిచ్చింది.

ఏపీకి మరో తుఫాన్ ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ అండమాన్‌నికోబార్ దీవుల సమీపంలో మరింత స్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉందని తెలిపింది.రానున్న 24 గంటల్లో ఈ వ్యవస్థ ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీని ప్రభావంతో నవంబర్ 1, 2 తేదీల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేసింది. అయితే, అల్పపీడనం దిశ, గాలుల వేగం, సముద్రంలో నెలకొనే వాతావరణ పరిస్థితులను బట్టి దాని తీవ్రత, ప్రభావంపై మరింత స్పష్టత రానుంది.**తుఫాన్ నష్టంపై సీఎం సమీక్ష** మరోవైపు అర్ణబ్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో జరిగిన నష్టం, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో అత్యవసర దూరదృశ్య సమావేశం నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.కొత్త అల్పపీడనం కదలికలు, వర్షాల తీవ్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రజలు వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసే తాజా సూచనలను గమనించాలని, అధికారుల హెచ్చరికలకు అనుగుణంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రిటర్నింగ్ ఆఫీసర్లే చంద్రబాబుకు ఏజెంట్లు!

(మొదటి పేజీ తరువాయి)

గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తీరుపై మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు కూటమి ప్రభుత్వం చేస్తున్నాయని తాము ఆరోపిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సేకరించాలని పార్టీ నేతలకు సూచించారు. భవిష్యత్తులో ఈ ఆధారాలు దర్యాప్తునకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.**కూటమి నేతలపై బియ్యం అక్రమ వ్యాపారం ఆరోపణలు** రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా వంటి కార్యక్రమాలు నిర్వీర్యమయ్యాయని జగన్ విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటల దిగుబడిపై ఆందోళన నెలకొన్న సమయంలో కూటమి నేతలు బియ్యం అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.గతంలో బియ్యం అక్రమ రవాణా అంశంపై కాకినాడ పోర్టులో 'సీజ్ ద షిప్' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ప్రస్తుతం ఆ అంశంపై చర్యలు కనిపించడం లేదంటూ విమర్శించారు.తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలను వైసీపీ నాయకులు ఆదుకోవాలని జగన్ సూచించారు. పంట నష్టం అంచనాలు సక్రమంగా నిర్వహించడం లేదని కూడా ఆయన ఆరోపించారు.

మియాపూర్ భూములు ప్రభుత్వానివే!

(మొదటి పేజీ తరువాయి)


కూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. ఈ తీర్పులను సవాలు చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.దాదాపు 23 ఏళ్లుగా కొనసాగిన న్యాయపోరాటంలో తాజాగా సుప్రీంకోర్టు అప్పీళ్లను కొట్టివేయడంతో ప్రభుత్వ భూముల హక్కులపై స్పష్టత వచ్చింది. విలువైన భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఈ తీర్పు కీలకంగా మారింది.

'సర్'పై ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహం

న్యూఢిల్లీ, మన జనప్రగతి అక్టోబర్ 29: ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్)పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు బీజేపీ వ్యూహరచన చేసింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ గురువారం ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. సర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి సమర్థంగా ఎదుర్కోవాలని చర్చించినట్లు సమాచారం.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీ నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. సర్ ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు, పార్టీ చేపట్టిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపైనా సమావేశాల్లో చర్చించారు.

డిజిటల్ మోసాల్లో బ్యాంకులదే బాధ్యత

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 29: డిజిటల్ అరెస్టు, సైబర్ మోసాల వల్ల ఖాతాదారులు నష్టపోతే, బ్యాంకులు తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించనట్లు తేలిన సందర్భాల్లో బాధితులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనుమానాస్పద లావాదేవీలను ముందుగానే గుర్తించి, నగదు బదిలీని నిలిపివేసే చర్యలు చేపట్టాలని సూచించింది.ఖాతాదారుల సాధారణ లావాదేవీలకు భిన్నంగా భారీ మొత్తాలు బదిలీ అవుతున్నప్పుడు బ్యాంకులు అప్రమత్తం కావాలని ధర్మాసనం పేర్కొంది. అవసరమైతే కృత్రిమ మేధ సాయంతో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని సూచించింది. సైబర్ మోసాల నియంత్రణకు రిజర్వు బ్యాంకు రూపొందిస్తున్న నిబంధనలను కూడా పరిశీలించనున్నట్లు తెలిపింది.

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బూసినేని విరూపాక్షి

- కుంకునూరులో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం
- నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 29:-కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ మండలం కుంకునూరు గ్రామంలో బుధవారం జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ కుమారుడి వివాహ వేడుకకు ఆలూరు ఎమ్మెల్యే బూసినేని విరూపాక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.గ్రామానికి వచ్చే మార్గంలో బాణసంచా కాల్చుతూ, భారీ జనసందోహంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలకడంతో కుంకునూరులో సందడి నెలకొంది. అనంతరం వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే బూసినేని విరూపాక్షి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవనకొండ మండల వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి దివాకర్ నాయుడు తల్లి, కుంకునూరు ఎంపీటీసీ అభ్యర్థి లీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్రరెడ్డి, బసవ రాజేంద్ర పటేల్, కురువ రామప్ప, జంగిలి లింగమూర్తి, మెడికల్ షాప్ ఉరుకుందు, మాల వెంకన్న, తలారి పెద్ద రంగన్న, గిత్త పరమేష్, మాల రమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ట్రెక్కింగ్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 29:-కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా కులమావు ప్రాంతంలో అక్టోబర్ 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపును చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని పాఠశాలప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్న సార్జెంట్ చెంజి అక్షయ,కార్పోరల్ గొర్ల వైష్ణవి, క్యాడెట్ అవుల రమ్య లకు ట్రెక్కింగ్ లో పాల్గొన్నందుకు సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు.ఈ సందర్భంగా క్యాంపులో ప్రతిభ కనబరిచిన కార్పోరల్ గొర్ల వైష్ణవి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని మూడో స్థానం సాధించడంతో ఆమెకు మెరిటోరియస్ సర్టిఫికెట్ లభించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను చాటడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది అన్నారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి ట్రెక్కింగ్ క్యాంపులు విద్యార్థుల్లో ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాడెట్ల తో కలిసి పాల్గొనడం ద్వారా జాతీయ సమైక్యత, స్నేహభావం, సాంస్కృతిక అవగాహన పెరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సోఫియా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ఓదార్పు

- వేమయ్య,ఈశ్వరమ్మ కుటుంబాలను కలిసిన సత్యప్రభావతమ్మ
- మృతులకు నివాళులర్పించిన నాగెళ్ల విశ్వేశ్వర్ రెడ్డి,వైఎస్సార్‌సీపీ నాయకులు



వేముల మన జనప్రగతి అక్టోబర్ 29:- ఆప్తులను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలను వైఎస్సార్‌సీపీ వేముల మండల జడ్పీటీసీ అభ్యర్థి నాగెళ్ల సత్యప్రభావతమ్మ పరామర్శించి, వారికి అండగా నిలిచారు. వేముల మండలం వి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నల్లబల్లె వేమయ్య (78), పోరెడ్డి సూరప్పగారి ఈశ్వరమ్మ (75) అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె, తన కుమారుడు నాగెళ్ల పవన్ విశ్వేశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చందా మాల్ రెడ్డితో కలిసి గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షిస్తూ వారిని ఓదార్చారు. మృతుల కుటుంబాల దుఃఖంలో పాలుపంచుకుని, వారికి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు మృతులకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పంపిణీ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

బ్యాలెట్ పేపర్ల ముద్రణలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 29:- స్థానిక సంస్థల ఎన్నికలు2026లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పంపిణీ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు.గురువారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ – 2026 లో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఎంపిటిసి, జడ్పీటీసి బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ల ముద్రణలో నిర్దేశిత నమూనాలు,ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయిన అనంతరం బ్యాలెట్ పేపర్ల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎలాంటి అక్షర దోషాలు, ముద్రణ లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మండలాల వారీగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా బ్యాలెట్ పేపర్లను క్రమబద్ధంగా విభజించి, సక్రమంగా అమర్చుకోవాలని కలెక్టర్ నోడల్ అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో బ్యాలెట్ పేపర్లు కీలకమైనవని, ఈ ప్రక్రియలో సంబంధిత అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత మండలాలకు సకాలంలో చేరవేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని దశల్లోనూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు సకాలంలో సంబంధిత మండలాలకు చేరేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ నోడల్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాలపై 60 రోజుల మెగా డ్రైవ్.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 29:-జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో జాతీయ న్యాయ సేవల పథకాలపై 60 రోజుల మెగా డ్రైవ్ ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ప్రారంభించారు. జాతీయ న్యాయ సేవల 13 పథకాలపై గురువారం గుడిపాడు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి ఆ పథకాలను గ్రామంలోని ప్రజలకు అందేలా ఈ 60 రోజుల మెగా డ్రైవ్ లో చేస్తామని తెలిపారు. నేటి నుండి 60 రోజులపాటు ప్రతిరోజు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు నియమించిన ప్యానల్ న్యాయవాదులు మరియు ప్యారా లీగల్ వాలంటీర్లు గుడిపాడు గ్రామాన్ని సందర్శించి ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించి వారికి ఆ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తారన్నారు. ప్రజలకు ఈ జాతీయ న్యాయ సేవలు పథకాల గురించి జడ్జి వివరిస్తూ బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య మరియు న్యాయ సహాయం అందించడం, మరియు జైలులో ఉన్న ఖైదీలకు, వారి కుటుంబాలపై ఆధారపడిన వారికి వారి పిల్లల చదువులకు భంగం కలగకుండా చూసుకోవడం, మానవ వణ్య ప్రాణుల దాడి బాధితులకు న్యాయాన్ని అందించడం,మాజీ సైనికులు,సైనికులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయసాయాన్ని అందించడం, డ్రగ్స్ పై ప్రజలకు అవగాహన కలిగించడం, బలహీన ఆదివాసీ మరియు సంచారతెగలకు న్యాయసహాయాన్ని అందించటం, పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవల పథకం లో భాగంగా బాల కార్మికులు అక్రమ రవాణాన్ని అరికట్టడం, మానసిక ఆరోగ్యము గలవారికి ఉచిత న్యాయ సహాయం, వైద్య సాయాన్ని అందించడం, వయో వృద్ధులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం, యాసిడ్ దాడి బాధితులకు నష్టపరిహారం అందించడము మరియు ఉచిత న్యాయ సహాయాన్ని వైద్య సదుపాలను కల్పించడం, మానవ అక్రమ రవాణా ను అరికట్టి మహిళలు, పిల్లలను కాపాడి వాళ్లకు సామాజిక భద్రత, ఈ సమావేశంలో కర్నూలు ట్రైని డిప్యూటీ కలెక్టర్ ప్రియంవద, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, గూడూరు తాసిల్దార్ వెంకటేష్ నాయక్, గూడూరు డిప్యూటీ ఎంపీడీవో మధులత, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ సునీల మ్మ, గూడూరు సబ్ రిజిస్టర్ శ్రీధర్ గుప్తా, గూడూరు సిడిపిఓ వరలక్ష్మి, గూడూరు ఎస్సై రాజకులయప్ప, గుడిపాడు పంచాయతీ సెక్రటరీ సలీం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ప్యారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నాయకుడు గోవర్ధన్ రెడ్డిని కలిసిన కూటమి మేయర్ అభ్యర్థి మల్లీ సువర్ణ

- కడప అభివృద్ధికి తోడ్పడండి.. అభివృద్ధికి ఓటు వేయండి



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 29:- కడప నగర అభివృద్ధికి తోడ్పడాలని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని కడప కూటమి మేయర్ అభ్యర్థి మల్లీ సువర్ణ, ఆమె భర్త మధుసూదన్ రెడ్డి కోరారు.గురువారం మధ్యాహ్నం కడపలోని శ్రీ బసవతారకం లా కాలేజీలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, కడప మాజీ పట్టణ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డిని మల్లీ సువర్ణ, మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న కార్పొరేషన్ ఎన్నికలు, కడప నగర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు.**సీనియర్ నాయకుడి సలహాలు, సూచనలు కీలకం** ఎన్నికల సమయంలో గోవర్ధన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు, ఆశీస్సులు ఎంతో అవసరమని మల్లీ సువర్ణ, మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. కడప నగరాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు అనుభవజ్ఞుల అభిప్రాయాలు ఉపయోగపడతాయని తెలిపారు. నగర అభివృద్ధి కోసం నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.**మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా స్థానికంగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. కడప నగరంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.కడప కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీనియర్ నాయకులను కలుస్తూ వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకుంటున్నట్లు మల్లీ సువర్ణ, మధుసూదన్ రెడ్డి తెలిపారు. నగర భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.



సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటులో 100 శాతం లక్ష్య సాధన

- ఆర్‌డీఎస్ పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ నిశాంత్ కుమార్

సంబేపల్లి, మన జనప్రగతి, అక్టోబర్ 29:- అన్నమయ్య జిల్లా రాయచోటి డివిజన్ పరిధిలో సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటు, విద్యుత్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబేపల్లి మండలం మోటకట్లలో సోలార్ యూనిట్‌ను పరిశీలించి పనుల నాణ్యత, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రాయచోటి డివిజన్‌లో మంజూరైన 2,784 సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను వంద శాతం ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించగా, లక్ష్యాన్ని సాధించిన విద్యుత్ శాఖ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు చేపట్టిన ఆర్‌డీఎస్ పనుల్లో 66 ఫీడర్లకు గాను 38 ఫీడర్ల పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, వ్యవసాయం, ఉద్యాన పంటలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.డివిజన్ పరిధిలో రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులపైనా సమీక్షించారు. ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లివింగ్‌స్టన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరప్రసాద్ రెడ్డి, ఏఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



దేవనకొండ మన జనప్రగతి అక్టోబర్ 29:-కర్నూలు జిల్లా దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన చాకలి కిష్టన్న వలస వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ సాధిక మామ ఈదాలు దేవరబండ సుభాన్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు ఈ సాయం అందించినట్లు తెలిపారు.టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, వెంకటేశు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం



కడప మన జనప్రగతి అక్టోబర్ 29:-కడప నగరంలోని 42వ డివిజన్‌లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి జావిద్ భాష ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి మేయర్ అభ్యర్థి మట్లి సువర్ణ పాల్గొని ప్రజలను కలిసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా మట్లి సువర్ణ మీడియాతో మాట్లాడుతూ, గత పాలకులు కడప నగర అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. కూటమికి ఒక అవకాశం కల్పిస్తే కడప నగరాన్ని దేశంలోనే ఐదవ అభివృద్ధి చెందిన మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలందరూ ఆదివారం తమ ఓటు హక్కును వినియోగించుకుని మేయర్ అభ్యర్థిగా తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంతియాజ్ అహ్మద్, భాష మహమ్మదీన్, అక్రమ్, అన్వర్, షఫీ, మహాభాష దస్తగిరి, ఖలీల్ భాషాతో పాటు పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధవటంలో ముమ్మర వాహన తనిఖీలు..

- అక్రమ మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు..!



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 29:-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది.నవంబర్ 5న జరగనున్న పొన్నపోలు, టక్కోలి గ్రామాల ఎంపీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిద్ధవటం మండల కేంద్రంలో వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం సాయంత్రం సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. కడప-పోరుమామిళ్ల రహదారిలోని బండి కనుమ సమీపంలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం విక్రయాలు లేదా రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు

పీలేరు, మన జనప్రగతి, అక్టోబర్ 29:జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అధికారులను ఆదేశించారు.గురువారం మదనపల్లెలోని సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో పీలేరు డివిజన్ ఎన్నికల కేంద్రాలను వారు పరిశీలించారు. డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో 367 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.

ప్రజల మద్దతుతో కూటమి విజయం ఖాయం: మారెడ్డి జయ భరత్ రెడ్డి



లింగాల మన జనప్రగతి అక్టోబర్ 29:-లింగాల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవి విజయమే లక్ష్యంగా అంబకపల్లె గ్రామంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రిపురం జడ్పీటీసీ సభ్యుడు మారెడ్డి జయ భరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుతో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్న నాయకులు, కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళ దేవికి మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సహకారంతో ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ కావాలంటే కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, లింగాల మండల టీడీపీ ఇన్‌ఛార్జి దేవిరెడ్డి సంజీవ రెడ్డి, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూముకుంట,వెలిగల్లులో సుగవాసి మండిపల్లి ఎన్నికల ప్రచార జోరు..!





గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 29:- గాలివీడు మండలంలో అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు పూలదండలు, మంగళహారతులతో మహిళల నీరాజనాలు. తూముకుంట, వెలిగల్లు గ్రామాలలో ప్రజల మధ్యకు కూటమి నేతలుగడపగడపకు ఎన్నికల ప్రచారం. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండలంలోని తూముకుంట, వెలిగల్లు గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం ఉత్సాహభరితంగా సాగింది. సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించిన రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాలివీడు జడ్ పి టీ సి అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి తో కలిసి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజల ఆత్మీయ పలకరింపులుడమహిళల మంగళహారతులుడపూలదండలతో ఘన స్వాగతాలుడకార్యకర్తల నినాదాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో నాయకులు ముందుకు సాగారు. **అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యండ ప్రజల ఆకాంక్షలే ప్రాధాన్యం!**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు. పాలకొండరాయుడు కుటుంబ వారసత్వం, ప్రజలతో విడదీయలేని అనుబంధం, మరొక్కసారి రుజువైంది. **గాలివీడు అభివృద్ధే లక్ష్యం.!**ప్రజల ఆదరాభిమానాల మధ్య సాగిన ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నవంబర్ 5, 2026 గురువారం జరిగే ఎన్నికల రోజున గాలివీడు మండల ప్రజలు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి, వేయించి, తెలుగుదేశం పార్టీ జడ్ పి టీ సి అభ్యర్థి సుగవాసి ప్రసాద్ బాబుని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కోరారు.

తుఫాను బాధితులను ఆదుకోవడంలో ఎమ్మెల్యే నానాజీ విశేష కృషి: బలగం ప్రసన్నకుమార్



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 29:-ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలను ఆదుకోవడంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) విశేష కృషి చేశారని తూరంగి గ్రామ మాజీ సర్పంచ్, జనసేన నాయకుడు బలగం ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు అండగా నిలిచారని తెలిపారు.గురువారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నానాజీ సూచనల మేరకు రూరల్ మండలంలోని కొవ్వాడ, ఉప్పలంక, తూరంగి గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాల అవసరాలను గుర్తించి, వారికి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు వారు కోరిన ఆహారాన్ని అందించేలా ఎమ్మెల్యే సూచనలు చేశారని వివరించారు.తుఫాను కారణంగా మత్స్యకారుల నావలు, బోట్లు, వలలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందని బలగం ప్రసన్నకుమార్ తెలిపారు. బాధితులకు ప్రభుత్వ పరిహారం అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే సూచనల మేరకు తాను, తన బృందం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు జన్మదినం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. తుఫాను కారణంగా నేలకొరిగిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యమని వివరించారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు పితాని తేజ, వల్లూరి రాజా, గరగ రామలక్ష్మన్, శాండీ, కనకాల విజయ్ కుమార్, మేడవరపు ప్రసాద శర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి జడ్పీటీసీ పోరులో రెబల్ అభ్యర్థుల సెగ.!

- **పొత్తులో జనసేనకు సీటు..స్వతంత్రులుగా బరిలో టీడీపీ నేతలు**
- **అధికారిక అభ్యర్థికి రెబల్స్ పోటీ..కూటమి ఓట్లపై ప్రభావం పడేనా.?**



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 29:-చిట్వేలి మండల జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి పొత్తుల ప్రభావం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థిగా ఆనాల సునీల్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే తెలుగుదేశం పార్టీ నుంచి టికెట్ ఆశించిన ఇద్దరు నాయకులకు అవకాశం దక్కకపోవడంతో వారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగారు. దీంతో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది.రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు ముక్కా రూపానందరెడ్డికి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందిన రాజుకుంట మాజీ సర్పంచ్ గుత్తి నరసింహులు జడ్పీటీసీ టికెట్ ఆశించారు. అయితే పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. అలాగే నగిరిపాడు పంచాయతీ జెట్టివారిపల్లికి చెందిన బుంగటావుల భాస్కర్ సైతం టీడీపీ నుంచి టికెట్ ఆశించినప్పటికీ అవకాశం దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.ఒకవైపు జనసేన అధికారిక అభ్యర్థి, మరోవైపు టీడీపీ నుంచి టికెట్ ఆశించి స్వతంత్రులుగా బరిలోకి దిగిన నాయకులతో చిట్వేలి జడ్పీటీసీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ఈ పరిణామాలు కూటమి ఓట్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? పార్టీ శ్రేణులు అధికారిక అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాయా? స్వతంత్ర అభ్యర్థులు ఎంతవరకు ఓట్లు సాధిస్తారు? అన్న అంశాలపై స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

అభివృద్ధే మా ప్రభుత్వం అజెండా

- కూటమి ప్రభుత్వం తరఫున జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యుల ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్,ముక్కా వరలక్ష్మీ లు



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 29:- రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం పెద్దవరంపాడు పంచాయతీ ఎంపీటీసీ సభ్యులు. కొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి మరియు జడ్పిటిసి సభ్యురాలు కీర్తి పార్టీ కవిత ను అఖండ మెజారిటీతో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఎల్లాయిపల్లి పెద్దవరంపాడు కృష్ణంపల్లి తదితర పంచాయతీలలో గ్రామాలలో పర్యటించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ కోట మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు అదేవిధంగా రైల్వేకోడూరు రూపురేఖలు మారాయని అన్ని విధాల గ్రామ గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయ డంకా మోగించాలని వారు ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కరూపానంద రెడ్డి సతీమణి మొక్క వరలక్ష్మి తదితరులు ఓటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కందేపల్లి,తారకపురం గ్రామాల అభివృద్ధే లక్ష్యం..

- **టీడీపీ ఎంపీటీసీ-2 అభ్యర్థి లలిత ఎన్నికల ప్రచారం..**
- **సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి..**



బొమ్మనహల్ మన జనప్రగతి అక్టోబర్ 29:-మండల పరిధిలో కందేపల్లి, తారకపురం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ-2 అభ్యర్థి లలిత స్పష్టం చేస్తూ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజలను కలుసుకుంటూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు,ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి లలిత మాట్లాడుతూ..గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని,ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తానని పేర్కొన్నారు,కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని,గ్రామాల్లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు,ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు,తప్పకుండా ప్రజల ఆశీర్వాదంతో ఎంపీటీసీగా గెలిపించాలని,కందేపల్లి, తారకపురం గ్రామాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లలిత భరోసా ఇచ్చారు,రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తనను ఆదరించి, సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు,ఈ కార్యక్రమంలో గోవిందవాడ ఎంపీటీసీ అభ్యర్థి సోమనాథ్ గౌడ్,తారకపురం డీలర్ భాస్కర్,కందేపల్లి డీలర్ ఎర్రిస్వామి,మాజీ ఎంపీటీసీ కావలి వేమన్న,ఎస్.జి.వన్నూరుస్వామి,కట్టంల్లి సుంకన్న,చెవుల వన్నూరుస్వామి,బంగి లోకేష్,నటరాజ్‌తో పాటు తెలుగుదేశం పార్టీ అభిమాన నాయకులు,కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

పొగాకు వ్యసనానికి దూరంగా ఉండాలి..ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● పొగాకు నియంత్రణ, అయోడిన్ లోపంపై అవగాహన



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 29:-మండల పరిధిలో దర్గా హొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అయేషా అంజూమ్ ఆధ్వర్యంలో పొగాకు నియంత్రణ అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో డాక్టర్ అయేషా అంజూమ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలు, అయోడిన్ ఆవశ్యకతపై వివరించారు,ముఖ్యంగా పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల నోటి క్యాన్సర్‌తో పాటు ఊపిరితిత్తులకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు,పొగాకు అలవాటు ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుందని, కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు,నేటి కాలంలో చిన్న వయసు పిల్లలు సైతం ఇలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని,విద్యార్థులు వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు,అలాగే శరీర ఎదుగుదలకు,మెదడు పనితీరుకు అయోడిన్ ఎంతో అవసరమని,అయోడిన్ లోపం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అయోడిన్ లోపం నివారణకు అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పొగాకు నియంత్రణ,అయోడిన్ లోప వ్యాధులపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేశారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు,ఎంపీహెచ్ఈఓ,హెల్త్ సూపర్‌వైజర్,ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


దర్గా హొన్నూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచార జోరు..

● పి.ముత్యాలప్ప..కె.రామాంజినేయులు ప్రజల మద్దతు కోరుతూ ఇంటింటా ప్రచారం



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 29:- మండల పరిధిలో దర్గా హొన్నూరు గ్రామంలో ఎంపీటీసీ-1 మరియు ఎంపీటీసీ-2 ఇద్దరు అభ్యర్థులు పి.ముత్యాలప్ప,కె.రామాంజినేయులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు, గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు,తమకు ఫ్యాన్ గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ,గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రజలకు వివరించారు,ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని హామీ ఇచ్చారు గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామాలా అభివృద్ధి,ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ,ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు ప్రచారంలో మండల కన్వీనర్ రామాంజనేయులు,మాజీ సర్పంచ్ శకుంతలమ్మ,మాజీ ఎంపిటిసి శ్రీదేవి,రామకృష్ణ, యువ నాయకుడు బడిగే వన్నురుస్వామి,గ్రామ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం.. విద్యార్థుల ఆవేదన



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 29:-పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో భోజనం అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిద్ధవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందించిన మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని విద్యార్థులు తెలిపారు. కోడిగుడ్లు సరిగా లేకపోవడంతో పాటు, స్మార్ట్ కిచెన్ ద్వారా సరఫరా చేస్తున్న భోజనం రుచికరంగా లేకపోవడంతో తినలేకపోయామని పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు భోజనాన్ని పారేసినట్లు తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతను వివరణ కోరగా,మధ్యాహ్న భోజనం,కోడిగుడ్ల నాణ్యతపై విద్యార్థులు ఫిర్యాదు చేశారని,ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు

నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 29:-నేల ఆరోగ్య పరిరక్షణ,సమతుల్య ఎరువుల వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం సిద్ధవటం మండలం జంగాలపల్లె ఎస్సీ కాలనీలో కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు వ్యవసాయ శాఖ సమన్వయంతో క్షేత్ర బచావో అభియాన్, వేరుశనగ పొలం దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ,విచక్షణారహితంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల ఆరోగ్యంతో పాటు మానవ ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు.నేల పరీక్షల ఆధారంగా పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువులు వాడాలని సూచించారు. దీనివల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, ఎరువుల సమర్థ వినియోగమే క్షేత్ర బచావో అభియాన్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి,శ్రీవల్లి, డీఆర్సీ పద్మజ,బయోటెక్ కిసాన్ హబ్ ప్రాజెక్ట్ వైపి ఆర్.గిరీష్,వ్యవసాయ శాఖ అధికారులు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,ఎంపీటీసీ సభ్యురాలు వెంకటమ్మ,ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు,మహిళా రైతులు పాల్గొన్నారు.

'నీవు ఒంటరిగా లేవు'.. విద్యార్థులకు మానసిక ధైర్యంపై అవగాహన



కలికిరి మన జనప్రగతి అక్టోబర్ 29:-సమగ్ర శిక్షా,పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు కలికిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య నెల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణ, సానుభూతి,పరస్పర సహకారంపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది కార్యక్రమంలో భాగంగా 'నీవు ఒంటరిగా లేవు' అనే సందేశంతో విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్. జయమ్మ మాట్లాడుతూ చదువు, పరీక్షలు, వ్యక్తిగత సమస్యల వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. అలాంటి సమయంలో సమస్యలను మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా కౌన్సిలర్లతో స్వేచ్ఛగా మాట్లాడాలని సూచించారు.మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులోనూ,జీవితంలోనూ మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులతో మానసిక ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. ఇతరులను ఎగతాళి చేయడం, అవమానించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, బాధలో ఉన్న స్నేహితుల సమస్యలను ఓపికగా విని వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. కోపం, ఆందోళన, భయం వంటి భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడంపై అవగాహన కల్పించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కే. సునీత, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర జెడ్పీటీసీ అభ్యర్థి కొత్తపల్లి మహేంద్ర ఇంటింటి ప్రచారం

● బీరువా గుర్తుతో ప్రజల్లోకి మద్దతు కోరుతూ..కొత్తపల్లి మహేంద్ర ప్రచారం

● ఆరు గ్రామాల్లో కార్యకర్తలతో కలసి విస్తృత పర్యటన



బొమ్మనహాల్ మన జనప్రగతి అక్టోబర్ 29:- బొమ్మనహాల్ మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది,స్వతంత్ర జడ్పీటీసీ అభ్యర్థి కొత్తపల్లి మహేంద్ర తన ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేస్తూ గురువారం మండల పరిధిలో దేవగిరి క్రాస్,హరేసముద్రం, ఉద్దేహాల్ క్యాంప్,కానాపురం, కొత్తూరు,ఎలంజి గ్రామాల్లో పర్యటించారు,ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు కేటాయించిన బీరువా గుర్తును పరిచయం చేసి మద్దతు కోరారు, ఈ సందర్భంగా కొత్తపల్లి మహేంద్ర మాట్లాడుతూ..గ్రామ ప్రజలతో మమేకమవుతూ తన అభ్యర్థిత్వాన్ని వివరించారు, జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తనకు ఒక అవకాశం కల్పించాలని,బీరువా గుర్తుపై ఓటు వేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు,గ్రామాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడటం ద్వారా వారి మద్దతు కోరుతూ ప్రచారాన్ని కొనసాగించారు, జడ్పీటీసీ అభ్యర్థి కొత్తపల్లి మహేంద్ర ప్రచార కార్యక్రమంలో ఆయన అభిమానులు, అనుచరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. గ్రామాలవారీగా పర్యటిస్తూ బీరువా గుర్తును ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు,ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను నేరుగా కలుసుకుని తనకు మద్దతు ఇవ్వాలని మహేంద్ర కోరుతున్నారు, జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న తనను బీరువా గుర్తుపై ఓటు వేసి ఆదరించాలని,ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జేఎంజే కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 29:-మండలంలోని కడపచెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న జేఎంజే కళాశాల విద్యార్థులు నెట్‌బాల్ క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28న నిర్వహించిన అండర్-14, అండర్-17 జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపికల్లో కళాశాలకు చెందిన యువన్ కుమార్, అయ్యన్న, సాయి లోకేష్, జయప్రభ, అజయ్, మనోజ్ఞ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రాగిణి గురువారం తెలిపారు. విద్యార్థుల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఉపాధ్యాయుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అహంకార పూరిత వ్యాఖ్యలు చేయడం రాచమల్లుకు తగదు

- రాచమల్లు ఆరోపణలపై మండిపడ్డ ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 29:- స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీలో పోటీ చేయడానికి ముందుకు రాని నేపథ్యంలోమాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం రాచమల్లుకు తగదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాచమల్లు మాట్లాడుతున్న తీరు,ఉపయోగిస్తున్న భాషపై ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో పేదలకు సంబంధించిన నిధులను రాచమల్లు, ఆయన బావమరిది దుర్వినియోగం చేశారని, వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ, బాధితులకు న్యాయం జరగకపోతే రాచమల్లు ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తానని అన్నారు. ప్రొద్దుటూరు మండలంలో టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు.మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకోవాలని రాచమల్లే ప్రోత్సహించారని వరదరాజులరెడ్డి వ్యాఖ్యానించారు.పులివెందులలో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని జగన్‌ను ప్రశ్నించారు. జగన్ సొంత గ్రామమైన బలపనూరులో టీడీపీ విజయం సాధించిందని గుర్తుచేశారు. 2029 నాటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బలహీనపరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జగన్ తన సొంత చెల్లి కుమార్తె వివాహాన్ని అడ్డుకుంటున్నారని కూడా ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మణ్, టీడీపీ మండల నాయకులు శంకరాపురం ప్రసాద్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాల జడ్పీటీసీ వైకాపా అభ్యర్థి శ్రీదేవి ఇంటింటి ప్రచారం



లింగాల మన జనప్రగతి అక్టోబర్ 29:-మండల పరిధిలోనని గుణకనవల్లి,రామన్నాతలవల్లి,చిన్న కుటుంబాలు గ్రామాల్లో లింగాల జడ్పీటీసీ వైకాపా అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా జడ్పీటీసీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి మాట్లాడుతూ పేద ప్రజల కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి తో పాటు వైయస్ తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల ఆకాంక్షాలకు అనుగుణంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి తమ స్వార్థపు అవసరాల కోసం పనిచేస్తుందన్నారు. పేద ప్రజల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జరుగుతున్నటువంటి లింగాల మండల జడ్పీటీసీ స్థానానికి వైకాపా తరపున తనను గెలిపించినట్లయితే మండల పరిధిలోని ప్రజలకు నిరంతరము అందుబాటులో ఉండి వారికి తాను సేవ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుత జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా తరపున నన్ను గెలిపించినట్లయితే మండల పరిధిలోని సమస్యలను కడప జడ్పీ సమావేశంలో పాల్గొని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కడప అభివృద్ధి కొరకు కూటమికి ఓటు వేయండి

- ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్యే మాధవి రెడ్డి



కడప మన జనప్రగతి అక్టోబర్ 29:-కడప అభివృద్ధి కొరకు కూటమి మేరభ్యర్థి మట్లి సువర్ణ కు ఓటు వేయించి గెలిపించాలని కమలాపురం శాసనసభ్యుడు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రజలను కోరారు. గురువారం ఈ సందర్భంగా చింతకొమ్మలదిన్నె మండలం లోని ఊటుకూరు వద్ద జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ గడిచిన ప్రభుత్వాలు కడపను బ్రష్టు పట్టించాయని తెలిపారు.ఇప్పుడు జరిగే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపిస్తే రాష్ట్రంలోనే బెస్ట్ కార్పొరేషన్ గా నిలబెడతామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్మశానానికి వంకలు ఒక బ్రిడ్జి కావాలని డ్రైనేజ్ వ్యవస్థను బాగుపరచాలని రోడ్లను వేయాలని వారు కోరారు.వీటన్నిటికీ ప్రభుత్వం అండగా ఉంటుందని త్వరలోనే ప్రతి సమస్యకు పరిష్కారం చేసి చూపిస్తామని కూటమి మే అభ్యర్థి సువర్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాపిరెడ్డి పల్లిలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి

- కొత్తలూరు సాయి కిషోర్ రెడ్డి విస్తృత ప్రచారం



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 29: -రైల్వే కోడూరు నియోజకవర్గంలోని వారి పల్లి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో పెద్ద వారం పాడు గ్రామపంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థి సభ్యులు వత్త నూరి.సాయి కిషోర్ రెడ్డి మరియు పామూరు రామిరెడ్డి దీపక్ రెడ్డిలు మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి వైసిపి పార్టీని అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్లి వాటర్ మహాసేయులకు విజ్ఞప్తి చేశారు వైసిపి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో ఎప్పుడు స్థాయిగా ఉంటాయని వైసిపి పార్టీ ఎప్పుడు ఆదరణ కోల్పోలేదన్నారు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపిటిసి జడ్పిటిసి సభ్యులు గూడూరు సుజాత కు సంబంధించిన జడ్పిటిసి సభ్యురాలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పాపిరెడ్డిపల్లెలో టీడీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

- సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 29: -తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం పాపిరెడ్డిపల్లెలో గురువారం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులు కొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి, ముక్కా వరలక్ష్మి విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ ప్రచారంలో కూటమి నాయకులు వాసుదేవరెడ్డి, రమేష్ నాయుడు, కోటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

- జడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు



కనిగిరి మన జనప్రగతి అక్టోబర్ 29: -జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల్లో తనను గెలిపించి ఆశీర్వదిస్తే కనిగిరి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీసీవై పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి వంగేపురం కార్తీక్ రాజు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామాల్లో రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేని చోట ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కనిగిరి మండల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలు తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కార్తీక్ రాజు విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై విద్యార్థుల అవగాహన ర్యాలీ



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 29: -ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు చిట్వేలి పట్టణంలో గురువారం శ్రీ సాయి వికాస్ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్‌కు అందించాలని విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా సాయి వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల నేల, నీరు కలుషితమవడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను కూడా సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, తగిన విధానంలో రీసైక్లింగ్‌కు పంపించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ దుకాణాల వద్దకు వెళ్లిన విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులకు, ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా పునర్వినియోగ సంచులను ఉపయోగించాలని సూచించారు. పరిసరాల్లో చెత్తను పడేయకుండా, వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే అలవాటును పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థుల ద్వారా సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై చైతన్యం కలిగించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనలక్ష్మి, చంద్రశేఖర్ రాజు, సాయి పాల్గొన్నారు.

చిట్వేలి మండలంలో పోలీసుల కవాతు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 29: -జడ్పిటిసి,ఎంపిటిసి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం చిట్వేలి మండల కేంద్రంతో పాటు నాగవరంలో ఎస్ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు.గ్రామంలోని ప్రధాన వీధులు, పలు ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది పర్యటిస్తూ పరిస్థితులను పరిశీలించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు ఈ కవాతు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడకూడదని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎన్నికల సమయంలో సంయమనంతో వ్యవహరిస్తూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీ చేయడం వంటి అక్రమాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటుందని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భరోసా ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ప్రాధాన్యమిస్తోందని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కవాతులో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

వేంపల్లి జనసేన జడ్పిటిసి అభ్యర్థి గెలుపుకు కృషి చేయండి

- బీటెక్ రవిని కలిసిన జనసేన నేత హరీష్



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 29: -స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పొత్తు లో భాగంగా వేంపల్లి జనసేన జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెస్త లక్ష్మీదేవి గెలుపుకు కృషి చేయాలని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డాక్టర్ హరీష్ కోరారు. ఈ మేరకు ఆయన ఇడుపులపాయ మాజీ సర్పంచ్ పోతిరెడ్డి చలపతి, కడప కు చెందిన జనసేన పార్టీ, చిరంజీవి అభిమాన సంఘ నేతల తో కలిసి సింహాద్రిపురంకు వెళ్లి పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవిని కలిశారు. ఎన్నికల్లో తన తల్లి లక్ష్మీదేవి వేంపల్లి జడ్పిటిసి గా పోటీ చేస్తుందని కూటమి పార్టీ నేతలు అందరూ తన తల్లి విజయానికి కృషి చేయాలన్నారు. మీ అండ ఉంటేనే తమ తల్లి గెలుపు ఖాయమని ఇందుకు మీరు సంపూర్ణ సహకారం అందించాలని హరీష్ బీటెక్ రవిని కోరారు. పులివెందుల మున్సిపల్ ఎన్నికల తర్వాత వేంపల్లి ఎన్నికలపై దృష్టి సారించి జడ్పిటిసి అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానని బీటెక్ రవి సందర్భంగా హరీష్ కు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

విజ్ డమ్ పాఠశాలకు ఎన్‌సీసీ విభాగం మంజూరు



రైల్వేకోడూరు మన జనప్రగతి అక్టోబర్ 29: -రైల్వే కోడూరు స్థానిక గాంధీనగర్‌లోని విజ్ డమ్ పాఠశాలకు జాతీయ విద్యార్థి సైనిక దళ విభాగం మంజూరైనట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ టీ. ప్రదీప్ తెలిపారు.కడపలోని 30(ఏ) బెటాలియన్‌కు చెందిన కల్నల్ సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సుబేదార్ దుర్గా ఛత్రి, హవల్దార్ శశికుమార్, ఎన్.హెచ్. ప్రసాద్, జీసీఎల్ మాన్యులు, రాజగోపాల్ రెడ్డి పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు జాతీయ విద్యార్థి సైనిక దళం ప్రాముఖ్యత, క్రమశిక్షణ, సేవాభావం గురించి వివరించారు.అనంతరం విద్యార్థులకు శారీరక, మానసిక పరీక్షలు నిర్వహించి బాలురు, బాలికల నుంచి మొత్తం 50 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరితో పాఠశాలలో జాతీయ విద్యార్థి సైనిక దళ విభాగాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో విజ్ డమ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీ.ప్రదీప్, పరిపాలనా సంచాలకుడు టీ.మదన్‌మోహన్,ప్రధానోపాధ్యాయురాలు టీ. ప్రియాంక పాల్గొన్నారు.రైల్వేకోడూరు మండలంలోని తమ పాఠశాలకు జాతీయ విద్యార్థి సైనిక దళ గుర్తింపు లభించడం పట్ల చైర్మన్ డాక్టర్ ప్రదీప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విభాగం మంజూరుకు సహకరించిన కడప 30(ఏ) బెటాలియన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించేందుకు ఈ విభాగం దోహదపడుతుందని పేర్కొన్నారు.

ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి..
ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి

- **ఓటును డబ్బు,మద్యానికి అమ్ముకోవద్దు**
- **ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు కృషి చేయాలి**



పులివెందుల మన జనప్రగతి అక్టోబర్ 29: -స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీ చేసే విధానాలను ప్రజలు తిరస్కరించాలని జై భారత్, సీపీఐ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు.జై భారత్ పార్టీ చేపట్టిన ఎన్నికల చైతన్య ప్రచారంలో భాగంగా పులివెందులలో సీపీఐ, సీఐటీయూ నాయకులతో కలిసి గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై భారత్ రాష్ట్ర అధ్యక్షుడు అరవింశర, సీఐటీయూ జిల్లా నాయకుడు గఫూర్, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటుకు డబ్బు, మద్యం ఇచ్చి ఓటర్లను ప్రలోభపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును, గ్రామాల అభివృద్ధిని నిర్ణయించే శక్తివంతమైన ఆయుధమని తెలిపారు.ధనబలం, మద్యబలంతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించే రాజకీయ విధానాలను ప్రజలు తిరస్కరించాలని నాయకులు సూచించారు. డబ్బు, మద్యం ఆశ చూపే అభ్యర్థులకు కాకుండా ప్రజా సమస్యలపై పోరాడే వారికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే వారికి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు ఓటు వేయాలని కోరారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పార్టీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.'ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టండి.. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి' అనే నినాదంతో ప్రజల్లో ఎన్నికల చైతన్యం తీసుకురావడమే ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాషా, సీపీఐ పులివెందుల పట్టణ నాయకులు సుభాన్ భాష, నాగరాజు, సూర్యాసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు ముందు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఇంజినీరింగ్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాలు



ప్రొద్దుటూరు మన జనప్రగతి అక్టోబర్ 29: -ప్రొద్దుటూరు పట్టణంలో ఎన్నికల కోడ్ అమలుకు ముందు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అక్టోబర్ 10వ తేదీకి ముందు ప్రారంభించిన పనుల పురోగతి, తాగునీటి సరఫరా, వార్డుల స్థాయిలో పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ప్రారంభమైన పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.ప్రతి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇంజినీరింగ్ అధికారులు, వార్డు అమినిటీస్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించాలని కమిషనర్ సూచించారు. మినీ కౌన్సిల్ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ప్రతిరోజూ నివేదిక సమర్పించాలని, వార్డు అమినిటీస్ సెక్రటరీలు ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించాలని తెలిపారు.అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయా, ఎంతవరకు పూర్తయ్యాయనే అంశాలను ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ ఎం. రాజేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై. యశోద, అసిస్టెంట్ ఇంజినీర్లు కె. సురేంద్రనాథ్ రెడ్డి, ఎన్. దస్తగిరి, కె. జగదీష్, జి. వినోద్, జి. సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బొంగగాని భారతి యాదవ్‌కు మద్దతుగా కూటమి నేతల ఎన్నికల ప్రచారం

పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 29:-పులివెందుల మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగగాని భారతి యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో ఈ. కొత్తపల్లె, మోటున్నతలపల్లె, కనంపల్లె గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ. కొత్తపల్లె మాజీ సర్పంచ్ గంగాధర్ యాదవ్ సతీమణి, కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగగాని భారతి యాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ఈ ప్రచారంలో పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్ మోహన్ రెడ్డి, ఈ. కొత్తపల్లె ఎంపీటీసీ పుష్పనాథ్ రెడ్డి, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు గ్రామాల్లో ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొంటూ బొంగగాని భారతి యాదవ్‌కు తమ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా నంద్యాల కొండారెడ్డి ఎన్నికల ప్రచారం



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 29:- పులివెందుల మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల తరపున ప్రొద్దుటూరు టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలోని 39వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి తూగుట్ల గీత కుమారి, కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపాలని ఓటర్లను కోరారు.

రాచుమర్రిపల్లెలో బొంగాని భారతి యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం



పులివెందుల రూరల్ మన జనప్రగతి అక్టోబర్ 29:- పులివెందుల మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి బొంగాని భారతి యాదవ్‌కు మద్దతుగా రాచుమర్రిపల్లె గ్రామంలో కూటమి నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, టీడీపీ నాయకులు పుష్పనాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, అజ్జుగుట్టు రవితేజ రెడ్డి, కంబల్లి గంగాధర్ రెడ్డి, తుమ్మలపల్లి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగాని భారతి యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష సమావేశం



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 29:- కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో ఈ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సమావేశానికి అధ్యక్షత వహించి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, న్యాయ సలహాలు, జైళ్ల సందర్శనలు, కేసుల వివరాల పరిశీలన, కేసుల పరిష్కార ప్రక్రియపై సమీక్షించారు. న్యాయ సహాయం అవసరమైన వారికి చట్టపరమైన సేవలు అందించే అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్. హరిబాబు, డిప్యూటీ చీఫ్ కౌన్సిళ్లు ఎం. చంద్రకాంతమ్మ, ఎం. శాంత, ఎం. వినయ్ కుమార్, అసిస్టెంట్ కౌన్సిళ్లు పి. మనోహర్, ఎం. సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్. రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు సబ్‌జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ప్రొద్దుటూరు మన జనప్రగతి, అక్టోబర్ 29:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ గురువారం ప్రొద్దుటూరు సబ్‌జైలు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే, న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి అవగాహన కల్పించారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

పదవిలో లేకున్నా ప్రజాసేవలో ముందున్న బూరుగడ్డ పుష్ప నగేష్

- కాకతీయ నగర్‌లో సీసీ రోడ్ల పనుల పరిశీలన
- మిగిలిన సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ



పటాన్‌చెరు, మన జనప్రగతి అక్టోబర్ 29:- పదవిలో లేకున్నా కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ సేవలను కాకతీయ నగర్ వాసులు అభినందించారు.రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ రోడ్ నంబర్ 5లో మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీ అధ్యక్షుడు అమృత్ సాగర్ అభ్యర్థన మేరకు ఆమె పరిశీలించారు. పనులు నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.కాలనీలోని రహదారులు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా, అదనపు నిధుల కోసం మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని బూరుగడ్డ పుష్ప నగేష్ తెలిపారు.

మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలి: కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 29:- తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికలు-2026లో భాగంగా మేయర్ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్లు, ఓట్ల లెక్కింపు కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేలా స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, భరత్ నాయక్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలి

- బీసీ, చేనేత, విద్యా, వైద్య రంగాల ప్రతినిధుల విజ్ఞప్తి



హైదరాబాద్, మన జనప్రగతి, అక్టోబర్ 29:- బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యారంగ అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న గుజ్జ సత్యనారాయణ (గుజ్జ సత్యం)కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పలు సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.గురువారం హైదరాబాద్‌లోని కాచిగూడ హోటల్ మహారాజాలో చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విజ్ఞప్తి చేశారు. గుజ్జ సత్యం అభ్యర్థిత్వాన్ని నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల సంక్షేమం, నాణ్యమైన విద్యతో పాటు చేనేత కార్మికుల ఉపాధి, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల అమలుపై గుజ్జ సత్యంకు అనుభవం ఉందని వక్తలు పేర్కొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన బీసీ, ప్రజా సంఘాలు, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆయనకు మద్దతుగా తీర్మానాలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది జగదీశ్, పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, జిల్లా నరేంద్ర, వంగాల బాలరాజ్, గంజి వెంకటేశం, కేవీ గౌడ్, సోమకవిత తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

- విజేతలుగా కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 29:- హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్తంగా గురువారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ హెచ్ఐవీపై అవగాహన పెంపొందించడం, సురక్షిత పద్ధతులపై విద్యార్థులకు సమాచారం అందించడం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్షను తగ్గించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి విద్యార్థి హెచ్ఐవీ నివారణపై అవగాహన పెంచుకొని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ద్వితీయ బహుమతిని కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, తృతీయ బహుమతిని జమ్మలమడుగు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించారు. ప్రోత్సాహక బహుమతిని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్‌సీఎన్‌ఆర్ విద్యార్థులు అందుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథి డాక్టర్ రవి బాబు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డాక్టర్ సురేష్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ వేంపల్లి భాస్కర్, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసం జర్నలిజం పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

- రూ.10 వేల విరాళం అందించిన పూర్వ విద్యార్థులు
- అభినందించిన వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 29:- యోగి వేమన విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ శాఖ పూర్వ విద్యార్థులు పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అభినందించారు.జర్నలిజం శాఖాధిపతి డాక్టర్ తమ్మినేని శ్యామ్ స్వరూప్ ఈ మొత్తాన్ని వీసీ చేతుల మీదుగా విశ్వవిద్యాలయ ఆలుమ్నీ అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఈ నిధులను పేద విద్యార్థుల చదువుకు వినియోగించాలని పూర్వ విద్యార్థులు కోరారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సంస్థ అభివృద్ధికి, ప్రస్తుత విద్యార్థుల విద్యా ప్రగతికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఆలుమ్నీ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకొని విశ్వవిద్యాలయంతో అనుబంధాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలుమ్నీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, డాక్టర్ వి. సునీత, ట్రెజరర్ ఎం. శశికుమార్ నాయక్, ఎస్.ఎం. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల పేరుతో అధిక వసూళ్లను అరికట్టాలి

- కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ నేత అంకన్న



కడప టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 29:- కడప, అన్నమయ్య జిల్లాల్లో ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజుల పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే మూడింతలు అధికంగా వసూలు చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న ఆరోపించారు.గురువారం రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో మాట్లాడుతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ అధికారులను డిమాండ్ చేశారు. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లించేలా చూడాలని, ప్రభుత్వ ఫీజుల వివరాలను కళాశాలల్లో స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేష్, దుర్గేష్, ఖాసీం, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఓటును డబ్బు, మద్యానికి అమ్ముకోవద్దు

- ధనస్వామ్యాన్ని బద్దలు కొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- జై భారత్, సీపీఐ, సీఐటీయూ నాయకులు

పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 29:- స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జై భారత్, సీపీఐ, సీఐటీయూ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పులివెందులలో ఎన్నికల చైతన్య గోడపత్రాలను ఆవిష్కరించారు.జై భారత్ రాష్ట్ర అధ్యక్షుడు అరవింశర, సీఐటీయూ జిల్లా నాయకుడు గఫూర్, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ, ఓటుకు డబ్బు, మద్యం పంపిణీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుభాన్ భాష, నాగరాజు, సూర్యాసేన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు విస్మరించి జగన్ కుటుంబంపై విమర్శలు చేయడం హాస్యాస్పదం

- వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 29:-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రతిపక్ష నేత జగన్ కుటుంబ వ్యవహారాల గురించి మాట్లాడడం తగదని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వేంపల్లిలో గురువారం జడ్పిటిసి అభ్యర్థి వెంకట శివమ్మ కు మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.స్థానిక మెయిన్ బజార్ లోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు అనంతరం ఆయన జడ్పిటిసి అభ్యర్థిని శివమ్మతో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తోందన్నారు. ఇదే ప్రక్రియ కొనసాగితే రాష్ట్రంలో ప్రజల ఆస్తి, మాన, ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ఆయన విమర్శించారు.రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీంతో సామాన్యులు ఏ వస్తువులు కొనలేని పరిస్థితి నెలకొంది అన్నారు. మరోపక్క చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బురద చల్లుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి జగన్ మోహన్ రెడ్డి కుటుంబ విషయాలు మాట్లాడే స్థాయికి చంద్రబాబు దిగజారారని విమర్శించారుతన స్థాయిని మరిచి వ్యక్తిగత విమర్శలకు దిగడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు.వైఎస్ జగన్ కుటుంబానికి సంబంధించిన అంశాలు కొన్ని పత్రికల్లో ప్రధాన శీర్షికలుగా వస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం గురించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడైనా మీడియా సమావేశంలో మాట్లాడారా? అని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్ చెల్లెలి హక్కుల గురించి మాట్లాడే ముందు తన కుటుంబ వ్యవహారాలను పరిశీలించుకోవాలని, జగన్‌కుటుంబ ఆస్తుల గురించి మాట్లాడేందుకు చంద్రబాబుకు ఏ అర్హత ఉందని సతీష్ రెడ్డి ప్రశ్నించారు.అహంకారం, నియంతృత్వ ధోరణితో లోకేష్ పాలిస్తుంటే చంద్రబాబు కల్లలేని కబోది లా చూస్తున్నారని సతీష్ రెడ్డి ధ్వజమెత్తారు.తన కుమారుడు చేస్తున్న పనులకు భవిష్యత్తులో చంద్రబాబు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రజలకు సహకరించాలన్నారు.ఆఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ చంద్ర ఓబుల రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు షబ్బీర్ వలి, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణు, వైకాపా రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి నిసార్ భాష తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్

మహిళలు, బాలల హక్కులు, ఉచిత న్యాయ సేవలపై ప్రత్యేక కార్యక్రమాలు



పటాన్‌చెరు, మన జనప్రగతి అక్టోబర్ 29:- విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముత్తంగి, ఇంద్రేశంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. పౌర హక్కులు, న్యాయ సేవల ప్రాముఖ్యతను వివరించారు.న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్ మహిళల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాలు, రాజ్యాంగ ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఉపపరిశీలకురాలు సునీత, సంబంధిత అధికారులు, గురుకుల విద్యాసంస్థల ప్రధానాచార్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, కటకం శివ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించడం, మహిళలు, బాలల హక్కులను పరిరక్షించడం, బాధితులకు న్యాయ సహాయం అందించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



రాజంపేట, మన జనప్రగతి అక్టోబర్ 29:- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎన్. భావన ఐఏఎస్ పరిశీలించారు.కేంద్రంలో సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, ఓటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ బి. వెంకట్రామయ్య, మన్నూరు సీఐ లింగప్ప, రాజంపేట టౌన్ సీఐ హేమసుందర్ రావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన కడప డీఎస్పీ భవాని

కడప టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 29:- కడప నగరంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కడప డీఎస్పీ టి. భవాని పరిశీలించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆమె కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అర్హులైన సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప టూ టౌన్ సీఐ శ్రీహరి, రూరల్ సీఐ ఎస్.కె. రోషన్, టూ టౌన్ ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి

- తెదేపా పరిశీలకుడు రఘునాథరెడ్డి



వేంపల్లె మన జన ప్రగతి అక్టోబర్ 29:-స్థానిక సంస్థల ఎన్నికల్లో వేంపల్లి మండలంలో జడ్పిటిసి, ఎంపీటీసీ లుగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని మండల తెదేపా పరిశీలకుడు అజ్జు గుట్టు రఘునాథరెడ్డి అన్నారు. మండలం లోని అలిరెడ్డి పల్లెలో గురువారం సాయంత్రం జనసేన పార్టీ జడ్పిటిసి అభ్యర్థి బెస్త లక్ష్మీదేవి, భాజపా ఎంపీటీసీ అభ్యర్థి ముద్ది శివకృష్ణ తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఈ ఎన్నికల్లో జడ్పిటిసి అభ్యర్థి కి గ్లాసు గుర్తుపైన, ఎంపీటీసీ అభ్యర్థికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ రామ మునిరెడ్డి, జిల్లా తెదేపా మాజీ కార్యదర్శి పొట్టిపాటి మోహన్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డాక్టర్ హరీష్, భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, ఇడుపులపాయ మాజీ సర్పంచ్ పోతిరెడ్డి చలపతి, ఎంపీటీసీ సభ్యులు వేమకుమార్, మహమ్మద్, సుష్మ,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వైఎస్సార్‌సీపీ జెడ్పిటిసి అభ్యర్థి

- **ఇంటింటికీ వెళ్లి మద్దతు కోరిన జడ్పిటిసి అభ్యర్థి నాగెళ్ల సత్యప్రభావతమ్మ**
- **ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి**



వేముల మన జనప్రగతి అక్టోబర్ 29:-వేముల మండల జడ్పీటీసీ అభ్యర్థి నాగెళ్ల సత్యప్రభావతమ్మ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు.బుధవారం మండలంలోని కొత్తపల్లి,గొందిపల్లె,రంగోరిపల్లె, పెండ్లూరు గ్రామాల్లో నాగెళ్ల పవన్ విశ్వేశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను నేరుగా కలుసుకుని వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను జడ్పీటీసీ అభ్యర్థిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..**ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమైన సత్యప్రభావతమ్మ వారి సమస్యలు, స్థానిక అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా సేవలందిస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధించి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.**ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి...**వైఎస్సార్‌సీపీ విధానాలను ప్రజలకు వివరిస్తూ పార్టీకి మద్దతు ఇవ్వాలని సత్యప్రభావతమ్మ కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో చందా మల్‌రెడ్డి,రాఘవరెడ్డి,ప్రవీణ్ రెడ్డి,చల్లా సునీల్ కుమార్, వేమ నారాయణరెడ్డి,గంగరాజు,ముస్కీన్, నాగప్ప,రాంపుల్లయ్య,ఓబులేసు,మరియు తదితరులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అందరూ కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నాగెళ్ల సత్యప్రభావతమ్మను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అప్రమత్తతోనే సైబర్ మోసాలు, ఆర్థిక నష్టాల నివారణ

- వైవీయూలో సైబర్ భద్రత, బ్యాంకింగ్ సేవలపై అవగాహన సదస్సు



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 29:- ఆధునిక సాంకేతిక యుగంలో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించేటప్పుడు అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ మోసాలు, ఆర్థిక నష్టాలను నివారించవచ్చని ఎస్బీఐ రీజినల్ కార్యాలయ అధికారి పి. ప్రదీప్ తెలిపారు.యోగి వేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-9, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజినల్ బిజినెస్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సమగ్ర ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల నియంత్రణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా పి. ప్రదీప్ మాట్లాడుతూ ఓటీపీ, పిన్, సీవీవీ వంటి బ్యాంకింగ్ రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఎస్బీఐ అధికారి ఆర్. భారతి బ్యాంకు పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, యోనో యాప్ వినియోగంపై వివరించారు. జి. శివ రామకృష్ణ విదేశీ విద్య కోసం అందించే రుణాలు, వ్యక్తిగత రుణాలు, ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాల ప్రయోజనాలను వివరించారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, ఎస్బీఐ అధికారులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో డ్రై డే నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

- ఎక్సైజ్ అధికారులకు డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశాలు



కడప టౌన్ మన జనప్రగతి, అక్టోబర్ 29- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో డ్రై డే నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు అధికారులను ఆదేశించారు.గురువారం కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పరిధిలోని అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలు, డ్రై డే మార్గదర్శకాల అమలుపై దిశానిర్దేశం చేశారు. డ్రై డే సమయంలో అక్రమంగా మద్యం నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమస్యాత్మక ప్రాంతాలు, దాబాలు, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. రూట్ వాచ్‌లు, ఆకస్మిక వాహన తనిఖీలను నిరంతరం కొనసాగిస్తూ అక్రమ మద్యం రవాణా, విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కడప ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కృష్ణకుమార్, సబ్‌ఇన్స్పెక్టర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174